# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 187 | విశాఖపట్నం | 8-4-2026 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 187 | VISAKHAPATNAM | 8-4-2026 WEDNESDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay




2లో

## రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టు..



5లో

## సచివాలయ భవనాలకు మోక్షం ఎప్పుడో?



6లో

## మజిల్ లాస్‌ను 'రివర్స్' చేయవచ్చా?



# ఏబీఎన్ ఆఫీస్‌ను ముట్టడించిన వైసీపీ నేతలు

**హైదరాబాద్, పతాకం న్యూస్:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో ప్రసారమైన 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' కథనంపై వైసీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హైదరాబాదులోని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించిన నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వైసీపీ అధినేత, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 'మావిగన్' వ్యాఖ్యలపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యజమాని, ప్రముఖ పాత్రికేయుడు రాధాకృష్ణ తన వీకెండ్ కామెంట్ లో విశ్లేషణ చేశారు. ఈ కథనం అటు ఏబీఎన్ ఛానల్‌లో, ఇటు ఆంధ్రజ్యోతి దినపత్రికలో కొత్త పలుకు కాలమ్ లో ప్రచురితమైంది. ఇందులో రాధాకృష్ణ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ క్యాడర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ మహిళలను అవమానించారంటూ రాధాకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే అంశంపై మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఫిల్మ్ నగర్ లో ఉన్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛానల్ ఆఫీసును ముట్టడించేందుకు పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలివచ్చారు. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీఎన్ ఆఫీసు వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తప్పలేదు. సమీపంలోనే అపోలో ఆసుపత్రి ఉండడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నా వైసీపీ శ్రేణులు వినిపించుకోలేదు. నిరసనకారులు వైసీపీ నేత అంబటి రాంబాబు నేతృత్వంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలుస్తోంది.

## తప్పుడు వార్తలు రాస్తే ఆంధ్రజ్యోతి ఆఫీస్‌ను తగలబెడతాం: రోజా



**తిరుపతి, పతాకం న్యూస్:** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు దాడికి యత్నించిన సంగతి తెలిసిందే. మరోవైపు తిరుపతిలో ఆంధ్రజ్యోతికి వ్యతిరేకంగా వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ... ఆ సంస్థ ఎండీ వేమూరి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జర్నలిజం పేరుతో రాధాకృష్ణ బ్రోకరిజం చేస్తున్నారని, మహిళలను కించపరిచేలా వ్యవహరిస్తే ఊరుకోబోమని ఆమె హెచ్చరించారు. (తరువాయి 2వ పేజీలో)

## భవిష్యత్తులో స్లీపర్ బస్సులను రద్దు చేస్తాం: మండిపల్లి



**అమరావతి, పతాకం న్యూస్:** బస్సుల్లో ప్రమాదాల నివారణపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కర్నూలు, మార్కాపురం, మారేడుమిల్లి ఘటనలకు మానవ తప్పిదమే కారణంమని తెలిపారు. రాష్ట్రంలో 16 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేశామని, ఇతర రాష్ట్రాల్లో రిజిస్టరై నిబంధనలు ఉల్లంఘించే వాటిని సీజ్ చేశామన్నారు. పది రోజుల్లో 10 వేల వాహనాలు తనిఖీ చేసినట్లు వివరించారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రైవేట్ ట్రావెల్స్‌కు ఆదేశించమన్నారు. త్వరలో బస్సు సీట్లపై టాక్సేషన్ తగ్గించేలా చర్యలు చేపడతామన్నారు. స్లీపర్ బస్సులను రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాశామన్న మంత్రి, అవసరమైతే భవిష్యత్తులో స్లీపర్ బస్సులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

## దాడులు సరికాదు: అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** మంగళవారం హైదరాబాద్‌లోని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయం దగ్గర వైసీపీ శ్రేణులు తీవ్ర ఆందోళనకు దిగారు. కార్యాలయం లోపలికి ప్రవేశించేందుకు వైసీపీ శ్రేణులు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థలపై వైసీపీ నేతలు దాడులకు ప్రయత్నించడం సరికాదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రశ్నించే మీడియా గొంతు నొక్కేందుకే వైసీపీ దాడులకు పాల్పడుతోందని తెలిపారు. అధికారంలో ఉండగా చేసిన అరాచకానికి ప్రతిఫలంగానే ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, అయినప్పటికీ బుద్ధి రాక రప్పా.. రప్పా అంటూ బెరి తెగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రూ.39,436 కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ప్రగతి పథంలో పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తూ, రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మంగళవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఈ కొత్త పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోనూ పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి.

## ఇకపై ఏపీ రాజధాని లేని రాష్ట్రం కాదు: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** 'ఆంధ్రప్రదేశ్... ఇకపై రాజధాని లేని రాష్ట్రం కాదు... ఇకపై అనిశ్చితిలో కూరుకుపోయిన భవిష్యత్తు కాదు' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అధికారికంగా గుర్తింపు పొందిన రోజు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడు తుందన్నారు. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొంది, భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి, గౌరవ భారత రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తరుణంలో... ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల ఆకాంక్ష ఎట్టకేలకు నెరవేరిందని తన ఎక్స్ సందేశంలో పవన్ పేర్కొన్నారు. ఈ చారిత్రక ఘట్టం సాకారం కావడానికి కృషి చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పవన్ తెలిపారు.


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## చెలగాటం..

బకాయిలు పేరుకుపోయినందున ఎన్టీఆర్ వైద్యసేవ పథకం అమలును ప్రయివేటు, కార్పొరేటు ఆసుపత్రులు మరొకసారి నిలిపివేశాయి. దీంతో, వివిధ శస్త్ర చికిత్సలు, అత్యవసర వైద్యం కోసం ఆయా హాస్పటల్లను ఆశ్రయించిన పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులూ ఎదుర్కొంటున్నారు. నగదు సేవలు తప్ప ఆరోగ్యశ్రీ సేవలు అందించటం లేదని ప్రయివేటు యాజమాన్యాలు బోర్డులు తగిలించటంతో రోగులు, వారి కుటుంబ సభ్యులూ హతాశు లవుతున్నారు. ఇలాంటి ఆపత్కాలం ఏడాదికి ఒకటీ, రెండుసార్లు తలెత్తటం రాష్ట్రంలో సర్వ సాధారణ అంశంగా మారింది. ఇది సామాన్యుల ఆరోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆరోగ్య అత్యవసరత, ప్రాణాపాయ పరిస్థితి ఎవరికీ చెప్పి రావు. హఠాత్తుగా ప్రాణాల మీదికి వస్తే -- ఆసుపత్రులకు పరుగులు తీయాల్సిందే! వైద్యరంగంలో కార్పొరేట్ విజృంభణ తరువాత- వైద్య వ్యయాన్ని భరించటం సామాన్యులకు అసాధ్యంగా మారిపోయింది. ప్రభుత్వరంగంలో ఆరోగ్య సేవలను విస్తరించి, పటిష్టపరిస్తే ప్రజలకు ఇంత భారమూ, హైరానా ఉండేవి కావు. 2007 ఏప్రిల్ 1న ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకం ఎప్పటికప్పుడు నిధుల కొరతను ఎదుర్కొంటూ -- ఆ సమయంలో ఆపన్ను లను అవస్థల పాలు చేస్తోంది. అధికార పార్టీలకనుగుణంగా పథకం పేరు మారుతుంది తప్ప -- నిర్వహణ తీరు మారటం లేదు. ఆరోగ్యశ్రీని, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి పటిష్టం చేస్తామని ప్రకటించిన టిడిపి కూటమి ప్రభుత్వం -- ఆచరణలో నిర్వహణను మెరుగుపర్చలేదు. అధికారం చేపట్టిన రెండేళ్లలో మూడు సార్లు బకాయిల సమస్య ముందుకొచ్చింది. తాజాగా రూ.3 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే వైద్యసేవలు నిలిపివేస్తామని వారం క్రితం అల్టిమేటం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పటల్స్ అసోసియేషన్ (ఆషా) ... బుధవారం నుంచి ఎన్టీఆర్ వైద్యసేవ అమలును నిలిపివేసింది. ఇప్పుడు వెయ్యి కోట్లు, తరువాత మరో వెయ్యికోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వ ప్రతినిధులు ప్రతిపాదించినా ఆషా అంగీకరిం చలేదు. గతంలోనూ ఇలాగే చెప్పారని, చెప్పినట్టుగా చెల్లించలేదని, ఈసారి రాతపూర్వక హామీ కావాలని పట్టు పడుతోంది. రేపో మాపో చర్చలు ఫలించి, సేవల పునరుద్ధరణ జరగొచ్చు. కానీ, ఈలోగా నెలకొన్న అనిశ్చితిలో బలయ్యే సామాన్యుల పరిస్థితేమిటి? ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల కుటుంబ సభ్యుల ఆవేదనకు, ఆందోళనకు మూల్యం ఎవరు చెల్లిస్తారు? బకాయిలు పేరుకున్న ప్రతిసారీ ప్రయివేటు ఆసుపత్రులు వైద్యం అందివ్వటానికి నిరాకరిస్తే- రోగుల కుటుంబ సభ్యులు అప్పో సప్పో చేసి, లేదా ఉన్న ఇంటినో స్థలాన్నో తెగనమ్ముకొని వైద్యానికి నగదు చెల్లించాల్సి వస్తోంది. అప్పు చేయటానికి కూడా అవకాశం లేని పేదలైతే ప్రాణాలనే పణంగా పెట్టాల్సి వస్తోంది. రాజ్యాంగంలోని 49వ అధికరణంలో పేర్కొన్న ఆదేశిక సూత్రాల ప్రకారం ... ప్రజారోగ్యం ప్రభుత్వం బాధ్యత. పోషకాహార వినియోగాన్ని, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, ప్రజారోగ్య అభివృద్ధి రాజ్యం యొక్క ప్రాథమిక విధి. ఈ మార్గనిర్దేశనతోనే 1949లో ఏర్పడ్డ భోర్ కమిటీ వివిధ దశల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, వైద్య సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఏమేం చేయాలో ప్రతిపాదించింది. తదనుగుణంగానే ప్రాథమిక, జిల్లా, నగర స్థాయిల్లో హాస్పటళ్ల నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన యంత్రాంగం ఏర్పాటైంది. 90వ దశకంలో నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాక క్రమేణా ప్రభుత్వాలు ఈ బాధ్యత నుంచి వైదొలుగుతూ, ప్రభుత్వ వైద్యరంగాన్ని నీరసపరిచాయి. ఎన్నికల్లో ప్రజామోదం కోసం ఆకర్షక పథకాలు ప్రకటించినప్పటికీ- ఆచరణలో పాలకులకు చిత్తశుద్ధి కొరవడుతోంది. ఫలితంగానే రాష్ట్రంలోని కోటీ 40 లక్షలకు పైగా ఉన్న ఆరోగ్యశ్రీ కార్డుదారులు ఏడాదికి రెండుసార్లయినా అవస్థల పాలవుతున్నారు. ఆరోగ్యకరమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి. ఆరోగ్యం ప్రజల హక్కు. ఈ విషయాన్ని గుర్తెరిగి వైద్యసేవలకు అంతరా కలక్కుండా చూడడం ప్రభుత్వ బాధ్యత. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఈ సమస్యను పరిష్కరించాలి. ఆరోగ్య సేవల కోసం ఎదురుచూస్తున్న సుమారు లక్షా 20 వేల మంది రోగులకు భరోసాగా నిలబడాలి.

# ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆసుపత్రుల సమ్మె విరమణ




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలోని స్పెషాలిటీ ఆసుపత్రుల్లో జరుగుతున్న సమ్మెను విరమించినట్లు స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటించింది. ప్రభుత్వం కొద్దిసేపటి క్రితం ఇచ్చిన హామీల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అసోసియేషన్ తెలిపింది. 10 రోజుల్లో వెయ్యి కోట్ల రూపాయలు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఆమోదించి సమ్మెను విరమించినట్లు ఆసుపత్రుల యాజమాన్య సంఘం ప్రకటించింది. 10 రోజుల్లో బకాయిలు చెల్లించని పక్షంలో మళ్లీ వైద్య సేవలను పూర్తిగా నిలిపివేస్తామని అసోసియేషన్ హెచ్చరించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చల సమావేశం మినిట్స్‌ను కూడా కొద్ది సేపటి క్రితం అసోసియేషన్‌కు అధికారులు పంపించారు. ఈ మినిట్స్‌లో ఇచ్చిన హామీలు, చర్చల వివరాలు స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సమ్మె విరమణతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింది అన్ని సేవలు పునఃప్రారంభం కానున్నాయి.

# బంగారానికి ఆశపడి .. వృద్ధురాలిని చంపిన బంధువులు



**చీపురుపల్లి, పతాకం న్యూస్:** బంగారానికి ఆశపడి సొంత బంధువులే ఓ వృద్ధురాలిని చంపి చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు ... చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపొరపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వఅద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు. ఈ క్రమంలో స్థానిక పోలీసులతోపాటు విజయనగరం, విశాఖపట్నం నుండి ఆర్ ఎఫ్ ఎస్ ఎల్ టీంలు, క్లూస్ టీంలు డి.ఎస్.పి ఎస్ రాఘవులు, సీఐ శంకర్రావుల ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ తవ్విచూడగా వృద్ధురాలి మృతదేహం కనిపించింది. ఈ సంఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టు..



**కాకినాడ, పతాకం న్యూస్:** జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో కాకినాడ రూరల్ మండలంలోని వలసపాకాల గ్రామంలో భారీ స్థాయిలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు అందిన పక్కా సమాచారం ఆధారంగా అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఒక దోస్త్ వ్యాన్‌ను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాహనాన్ని సీజ్ చేసి సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రాథమిక విచారణలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనతో ప్రాంతంలో కలకలం రేగింది. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారుల కఠిన వైఖరి స్పష్టమవుతోంది.

# తగులబెడతాం: రోజా

(మొదటిపేజీ తరువాయి)

రాధాకృష్ణ డొక్కు సైకిల్‌పై వచ్చి వేల కోట్లకు ఎలా ఎదిగారో అందరికీ తెలుసని రోజా అన్నారు. చంద్రబాబుకు బ్రోకర్‌గా పనులు చేస్తూ 'కొత్త పలుకు' పేరుతో కొవ్వెక్కి మాట్లాడుతున్నారని... ఆ కొవ్వును కరిగిస్తామని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ మహిళా నేతల గురించి, నాయకుల కుటుంబ సభ్యుల గురించి తప్పుగా రాస్తే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే ఆంధ్రజ్యోతి కార్యాలయాన్ని తగలబెడతామని హెచ్చరించారు. "మీరు తిట్టిస్తే... మాకు తిట్టడం రాక కాదు, మా సంస్కారం అడ్డు వస్తోంది. మేము తిట్టడం మొదలుపెడితే మీరు రోడ్లపై తిరగలేరు" అని కూటమి నేతలను ఉద్దేశించి రోజా అన్నారు. చంద్రబాబు రాయలసీమలో పుట్టి ఈ ప్రాంతానికే ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం 2 వేల కోట్లు ఖరు చేయలేని వ్యక్తి, అమరావతికి 2 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో చంద్రబాబు చీకటి ఒప్పందాలు చేసుకుని ఏపీ ప్రయోజనాలను తాకట్టు పెట్టారని ఆరోపించారు. 87 శాతం పూర్తయిన రాయలసీమ ప్రాజెక్టులను నిలిపివేయడం అంటే ఈ ప్రాంత ప్రజల గొంతు కోయడమేనని, దీనిపై మహా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు.

# తప్పు చేసిన వారు ఎప్పటికీ కాలం నుంచి తప్పించుకోలేరు: కొల్లు రవీంద్ర




**అమరావతి, పతాకం న్యూస్:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆఫీస్‌పై వైసీపీ దాడిని మంత్రి కొల్లు రవీంద్ర ఖండించారు. రాజధాని విషయంలో జగన్ రెడ్డి వైఖరిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. రౌడీమూకలతో కలిసి మాజీ మంత్రులు మీడియా సంస్థపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. వైసీపీ రాక్షస సంస్కృతికి ఈ దాడి నిదర్శనమని చెప్పుకొచ్చారు. సొంత మీడియాలో ఎవరిపై ఎలాంటి ఆరోపణలైనా చేస్తూ.. వారి వైఫల్యాలను ప్రశ్నిస్తే దాడులా అని నిలదీశారు. ఐదేళ్ల పాలనలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌తో పాటు అనేక మీడియా సంస్థలపై వైసీపీ వేధింపులకు పాల్పడిందని మంత్రి ఆరోపించారు. జగన్ పాలనలో జీవో 2430 ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకూడదు అంటూ మూర్ఖంగా వ్యవహరించారని గుర్తుచేశారు. ఇప్పుడు ఏకంగా ప్రశ్నించే వారిపై దాడులు అత్యంత సిగ్గు చేటని మండిపడ్డారు. జగన్ రెడ్డి మూర్ఖత్వాన్ని, రాక్షస ప్రవృత్తిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తప్పు చేసిన వారు ఎప్పటికీ కాలం నుంచి తప్పించుకోలేరని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు

# న్యాయవాది దారుణహత్య



**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:**అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గం పరిధిలోని కె.వి.పల్లి మండలంలో ఓ న్యాయవాది దారుణహత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో న్యాయవాది తల్లిదండ్రులు కూడా గాయపడ్డారు. మంగళవారం న్యాయవాది తరపు కుటుంబ సభ్యుల కథనం మేరకు .... వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న పూజారి ఎల్లయ్య (35) కె.వి పల్లి మండలం, తీతవగుంటపల్లి గ్రామ పంచాయతి, పాతవడ్డిపల్లిలో నివాసం ఉంటున్నారు. గుర్తుతెలియని దుండగులు సుమారు పదిమందికి పైగా న్యాయవాది ఇంటికి వచ్చి, తలుపులు పగలగొట్టి, లోనికి చొరబడ్డారు. ఆ శబ్దానికి నిద్ర మేల్కొన్న ఎల్లయ్య పై వారు రాళ్ళతో దాడి చేసి హతమార్చారు. అడ్డొచ్చిన అతని తల్లిదండ్రులు పూజారి వెంకటరమణ, రెడ్డమ్మ లను కూడా గాయపరిచారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారని తెలిసింది. ఈ దాడికి పాత కక్షలే కారణం అయ్యుంటాయని గ్రామస్తులు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు గ్రామంలో ఒకచోట ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మరో చోటికి మార్చడంలో ఆ న్యాయవాది ప్రమేయం ఉందన్న అనుమానం కూడా కారణం అయ్యుండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయంలో జరిగిన ఈ దాడితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కె.వి.పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. న్యాయవాది హత్యకు పాల్పడిన వ్యక్తులెవరు, దాడి వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రాత్రి వేళలో చోటు చేసుకున్న ఈ హత్యా సంఘటన గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేసింది. మృతుడికి భార్య శ్రీలేఖ, ఎనిమిదేళ్ల కుమార్తె, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ ఘటనా సమయంలో మృతుడి భార్య తన పుట్టింటికి వెళ్ళినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోలీసులు శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న స్థానిక న్యాయవాదులు కూడా పట్టణ ప్రాంతీయ ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# బెంగాల్‌పై కన్నేస్తే పాక్ ఎన్ని ముక్కలవుతోందో దేవుడికే తెలియాలి: రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. 'పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు ఇవ్వకుండా ఉండాల్సింది. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు ముక్కలైనప్పుడు ఆ పరిణామాలను వాళు చవిచూశారు. ఈసారి కనుక బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ భగవంతుడికే తెలియాలి' అని రాజ్‌నాథ్ చురకలు వేశారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటనలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్ నిశాంతి

**పాడేరు, పతాకం న్యూస్:**తాగు, సాగునీటి అవసరాలతో పాటు భావితరాల కోసం భూగర్భ జలాల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని కలెక్టర్ టి.నిశాంతి అన్నారు. పాడేరు మండలం తుంపాడ గ్రామంలో 'నీటి భద్రత– సాగునీటి సంఘాల బాధ్యత' వంద రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నీటి భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరచుకోవాలని, భూగర్భ జలాల సంరక్షణతోనే అది సాధ్యమవుతుందన్నారు. అలాగే సాగునీటి సంఘాలు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా అధికారులు సూచించే వాటిని వి?ధిగా పాటించాలని, భూగర్భ జలాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణపై ప్రజలు, సాగునీటి సంఘాలు, జలవనరుల శాఖ, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలన్నారు. 2014– 19లో సీఎం చంద్రబాబునాయుడు నీరు– చెట్టు పథకంలో భాగంగా నీటి వనరుల సంరక్షణ, సాగునీరు సద్వినియోగానికి బాటలు వేశారని గిడ్డి ఈశ్వరి గుర్తు చేశారు. అంతకు ముందు తుంపాడ పెద్ద చెరువును అందరిరితో కలిసి కలెక్టర్ నిశాంతి సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ, జల వనరుల శాఖ ఈఈ ఈఈ ఆర్.రాజేశ్వరరావు, డీఈఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ విద్యాసాగరరావు, తహశీల్దార్ అరుణ్‌చంద్ర, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, సర్పంచ్ లకే పార్వతమ్మ, గిరిజన రైతులు పాల్గొన్నారు.



కలెక్టర్ టి.నిశాంతి కలెక్టరేట్‌లోని పలు విభాగాలు, అక్కడున్న పలు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. కలెక్టరేట్ పరిపాలనా విభాగానికి వచ్చి అక్కడ అధికారులు, ఉద్యోగులను పరిచయం చేసుకుని, తర్వాత పీజీఆర్ఎస్, ఇతర విభాగాలతోపాటు ముఖ్య ప్రణాళికా విభాగం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పౌర సరఫరాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ల్యాండ్ సర్వే, డీపీఆర్వో, తదితర కార్యాలయాలను సందర్శించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు.

## 28న విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌ను ప్రారంభించనున్న చంద్రబాబు




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రాబోతోంది. ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్.. విశాఖపట్నంలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ కూడా హాజరుకానున్నారు. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీ ఇన్‌ఫ్రా సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నాయి. ఈ డేటా సెంటర్ కోసం మొత్తం 15 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.27 లక్షల కోట్లు) పెట్టుబడిగా పెట్టనున్నారు. దీనిని 1000 మెగావాట్ల సామర్థ్యంతో అభివృద్ధి చేయనున్నారు. శంకుస్థాపన అనంతరం నిర్మాణ పనులు అధికారికంగా ప్రారంభమవుతాయి. ఈ భారీ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విశాఖ పరిధిలోని మూడు ప్రాంతాల్లో 601.4 ఎకరాల భూమిని కేటాయించింది. వీటిలో తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాలు ఉన్నాయి. ప్రస్తుతం తర్లువాడలో స్థలాన్ని చదును చేసే పనులు కూడా జరుగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ప్రకారం, ఈ ప్రాజెక్టును 2028 జులై నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటుతో విశాఖ నగరం టెక్ హబ్‌గా మరింత అభివృద్ధి చెందడంతో పాటు, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొంటారని తెలుస్తోంది.

## 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు
# చేపల వేట బంద్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా వేసవిలో చేపల వేటపై నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. సముద్రంలో చేపలు వేసవిలో తమ సంతాన పునరుత్పత్తి ప్రక్రియలో ఉంటాయి. ఆ సమయంలో వాటిని వేటాడితే మత్స్య సంపద తగ్గిపోతుందని, ఏటా రెండు నెలలు నిషేధించడం ఆనవాయితీగా వస్తోంది. తూర్పు తీరంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులన్నింటిలోనూ ఈ నెల 15 అర్ధరాత్రి నుంచి జూన్ 16వ తేదీ వరకు అంటే 61 రోజులు నిషేధం అమలులో ఉంటుంది. ఆ సమయంలో భారత ప్రాదేశిక జలాల్లోకి మరపడవలు ఏవీ వేటకు వెళ్లకూడదు. ఇంజన్ లేని సంప్రదాయ బోట్లు మాత్రం వేటకు వెళ్లవచ్చు. వాటికి మినహాయింపు ఉంది. ఇంజన్ బోట్లు అయితే సముద్రంలో ఎక్కువ దూరంలో లోతైన ప్రాంతాల్లో వేట సాగిస్తాయని వాటిపై నిషేధం విధించారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌ను కేంద్రంగా చేసుకొని సుమారు 700 మరపడవలు చేపల వేట సాగిస్తున్నాయి. ఇప్పుడు అవన్నీ 15వ తేదీ నుంచి జెట్టీకి పరిమితం అవుతాయి. ఈ నిషేధం పశ్చిమ తీరంలోని రాష్ట్రాలకు జూన్ ఒకటి నుంచి జూలై 31 తేదీ వరకు ఉంటుంది. ఈ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఉపాధి ఏమీ ఉండదని కుటుంబానికి రూ.20 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద సాయం అందిస్తోంది. విశాఖ జిల్లాలో గత ఏడాది ఈ పథకానికి రూ.12,995 మందిని అర్హులుగా గుర్తించారు. ఈ ఏడాది కూడా జాబితా సేకరించి, అర్హులైన వారికి సాయం అందిస్తారు. అయితే దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. రెండు, మూడు రోజుల్లో ఆదేశాలు వస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

## ప్రజల ఆరోగ్యానికి ప్రపంచ దేశాల
# సమిష్టి కృషి అవసరం: గెసిల్లా



**మల్కాపురం, పతాకం న్యూస్:** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రపంచంలో ఉన్న అన్ని దేశాలు బాధ్యత వహించాలని, అన్ని దేశాలు కలిసి కృషి చేయాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు.స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ– ప్రతి ఒక్కరూ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలని, వ్యాధి తొలి దశలోనే వైద్యుడిని సంప్రదించాలని,సొంత వైద్యం పనికిరాదని అన్నారు.సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్న సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కాస్లిన్ మాట్లాడుతూ– యువత ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. సమావేశంలో జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి, ఇంటర్మీడియట్ ప్రోగ్రాం అధికారి ఎన్.నదియా ఆరోగ్య దినోత్సవ ప్రాధాన్యత పై ప్రసంగించారు. అంతకుముందు విద్యార్థినులు కళాశాల నుండి జవహర్ నగర్ మరియు ఇందిరా కాలనీల మీదుగా ఆరోగ్య అవగాహన ర్యాలీని నిర్వహించి, ఆరోగ్య సూత్రాలపై ఇంటింటి ప్రచారం చేశారు.మొత్తం కార్యక్రమాలను నదియా మరియు డాక్టర్ సుధా సమన్వయం చేశారు. కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థినులు,జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

## వార్డు సచివాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**సింహాచలం, పతాకం న్యూస్:** జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ 98వ వార్డులోని 524, 523, 529 సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వాహణ తీరుతెన్నులు, మూవ్‌మెంట్ రిజిస్టర్ నిర్వాహణను సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారుల పేర్లను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సిబ్బందిని ఆదేశించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు మరింత శ్రమించాలన్నారు. 524వ సచివాలయం నడుస్తున్న భవనం శిథిలావస్థకు చేరుకుందని, వినియోగదారులు కార్యాలయానికి దూరంగా ఉండడంతో సర్వేలు చేయడానికి కాస్త సమయం పడుతుందని సిబ్బంది ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సచివాలయ భవనానికి తక్షణం మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ నేపథ్యంలో సచివాలయ కార్యాలయాన్ని లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా మార్చాలని కలెక్టర్ ఆదేశించారు.

## ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

**తగరపువలస, పతాకం న్యూస్:** 2005లో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, వేతనాలు పెంచాలని, 2025లో విబి గ్రామ్ జీ పేరుతో తెచ్చిన కొత్త పథకాన్ని రద్దు చేయాలని సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి డిమాండ్ చేశారు. భీమిలి మండలం టి.నగర పాలెం పంచాయతీలో వి బి గ్రామ్ జీ పథకం ద్వారా జరుగుతున్న చెరువు పనులను ఆయన పరిశీలించారు. తమ సమస్యలను కూలీలు మూర్తికి వివరించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, అప్పటి యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాలు ఒత్తిడి తేవడం ద్వారా 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టారని, ఈ పథకం వల్ల వ్యవసాయ కార్మికులకు పని గ్యారెంటీ కలిగిందని తెలిపారు. వేతనాలు పెరిగాయన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు వేతనం లభించిందని పేర్కొన్నారు. కార్పొరేట్ల ఒత్తిడితో ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని మార్చి విబి గ్రామ్ జీగా తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల ఎక్కువ మంది కూలీలకు ఉపాధి దూరమైందన్నారు. రాష్ట్రాలపై ఆర్థికంగా భారం పడుతుందని తెలిపారు. ఫేషియల్ యాప్‌ను రద్దు చేయాలని, పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పల్లా రమణ, పి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి పాలనలో విషయం వీక్.. పబ్లిసిటీ పీక్

### వైయస్సార్సీపి అనకాపల్లి జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షుడు రమణ



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** దేవరపల్లి కూటమి పాలనలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, చేసింది తక్కువ ఆర్భాటాలకు ఎక్కువ ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని కూటమి నాయకులు దోచుకుంటున్నారని వైఎస్ఆర్సిపి ఆర్.టి.ఐ జిల్లా అధ్యక్షుడు కే.వి రమణ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ సూపర్ సిక్స్ అమలు చేయలేదని, ప్రజలు సూపర్ సిక్స్ గురించి ప్రశ్నిస్తే సూపర్ సిక్స్ ఎప్పుడో ఇచ్చేశామని సూపర్ 8 కూడా ఇచ్చేస్తున్నామని కూటమి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రశ్నిస్తామన్న జనసేన నాయకుల గొంతులు మూగబోయాయని, కూటమి పాలనలో ఆరోగ్యశ్రీని అటకెక్కించారని,నిరుద్యోగ భృతి ఊసే లేదని, బీసీలకు 50 సంవత్సరాలు పెన్షన్ మాట పక్కన పెడితే, 60 సంవత్సరాలు వచ్చిన వారికి కూడా కొత్త పెన్షన్ లేదని, మహిళలకు నెలకు 1500 ఇస్తానని నీకు 15 నీకు 15 నీకు 18 ఏమైందని కె.వి.రమణ ఎద్దేవా చేశారు. ఉచిత గ్యాస్ మాట దేవుడెరుగు బ్లాక్ లో డబ్బులు పెట్టి గ్యాస్ కొనుక్కునే పరిస్థితి ఈరోజు వచ్చిందని,108 పరిస్థితి మరీ అధ్వానంగా తయారైందని ఈ సమస్యలన్నీ గాలికి వదిలి, రాజధాని అమరావతి పేరు చెప్పి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని, ప్రజల పేరుతో అప్పులు చేస్తూ, రాజధాని పేరుతో రాష్ట్రాన్ని దోచేస్తూ, ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేస్తూ కుల రాజధాని నిర్మిస్తున్నారనడానికి రాజ్యసభలో రేణుక చౌదరి గారు మాట్లాడిన మాటలే దీనికి నిదర్శనమని అన్నారు. రాజధాని పేరు చెప్పి కోట్లాది రూపాయలు హెచ్చిస్తూ ఆంధ్రప్రదేశ్ ని మరో శ్రీలంకగా మారుస్తున్నారని,రాజధాని పేరు చెప్పి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారని అన్నారు. రాజధానిగా జగన్ సూచించిన మావిగన్ ప్రతిపాదన రాష్ట్రానికి చాలా మంచిదని దీనివలన అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారని, కూటమి కుట్రలను ప్రజలు గ్రహించారని, ఆంధ్రప్రదేశ్ ప్రజలు అమాయకులు కారని రాబోయే రోజుల్లో ఏ ఎన్నికల్లో వచ్చినా కూటమికి బుద్ధి చెప్పడం ఖాయమని కెవి రమణ అన్నారు్న రైతులకు చెప్పాడు. వెంటనే గిరిజన రైతులు అక్కడికి చేరుకుని ఆ భారీ విష సర్పాన్ని హతమార్చారు. ఇటువంటి భారీ సర్పాన్ని ఎప్పుడూ చూడలేదని వారు తెలిపారు. ఇది గిరినాగు అని కొందరు అంటున్నారు. ఈ సర్పం కాటు వేస్తే క్షణాల్లో మరణిస్తారని అంటున్నారు. ఈ ఘటనతో అమ్మవారి ధారకొండ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## వేసవి సెలవుల్లో విద్యార్థులు, పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

### అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, పతాకం న్యూస్:** పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులు మరియు చిన్న పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ కోరారు. సెలవుల్లో సరదా కోసం పిల్లలు ప్రమాదకరమైన జలాశయాల వద్దకు వెళ్లకుండా చూడటం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ పలు కీలక సూచనలు జారీ చేశారు. పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి లేదా స్నానాల కోసం సమీపంలోని చెరువులు, బావులు, కాలువలు, సముద్ర తీరం మరియు నీటి కుంటల వద్దకు వెళ్లే అవకాశం ఉంటుంది. నీటి లోతు తెలియక, ప్రవాహ వేగానికి లోనై ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉంది. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా అటువైపు వెళ్లనివ్వకూడదు. పిల్లలు ఇంటి వద్ద ఉన్న సమయంలో వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండేలా జాగ్రత్త పడాలి. నీటి ప్రమాదాల వల్ల కలిగే నష్టాలను, గతంలో జరిగిన విషాద సంఘటనలను పిల్లలకు వివరించి వారిలో అవగాహన పెంపొందించాలి. సరదా ప్రాణాంతకం కాకూడదని వారికి తెలియజేయాలి.సెలవుల్లో పిల్లలను ఆటపాటలు, కథల పుస్తకాలు చదవడం లేదా వేసవి శిక్షణ శిబిరాల వైపు మళ్లించడం ద్వారా వారి సమయాన్ని సురక్షితంగా మరియు ఉపయోగకరంగా మార్చవచ్చు.జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులు, స్థానికులు అలల ఉధృతిని గమనించాలి. హెచ్చరిక బోర్డులు ఉన్న చోట నీటిలోకి దిగడం ప్రాణాంతకమని గుర్తించాలి."పిల్లల భవిష్యత్తు మరియు వారి భద్రత తల్లిదండ్రుల బాధ్యత. వేసవి సెలవుల్లో ఏ ఒక్క కుటుంబంలోనూ విషాదం చోటుచేసుకోకూడదన్నదే మా ఉద్దేశ్యమన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుంది, ప్రజలు కూడా సహకరించాలి" అని ఎస్పీ తుహిన్ సిన్హా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం సంభవిస్తే వెంటనే డయిల్ 100/112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

## గిరిజన రైతుల చేతిలో హతమైన భారీ సర్పం



**జీకే వీధి, పతాకం న్యూస్:** జీకేవీధి మండలం అమ్మవారి ధారకొండ గ్రామంలో భారీ విష సర్పం కలకలం రేపింది. ఒక గిరిజన రైతును కాటు వేయడానికి ప్రయత్నించగా, అతను త్రుటిలో తప్పించుకొని ప్రాణాలను కాపాడుకున్నాడు. సుమారు 15 అడుగుల భారీ విషసర్పాన్ని చూసిన గ్రామస్థులు భయాందోళన చెందారు. సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో రైతులు టమాటా పంట పొలానికి వెళ్లి వస్తుండగా భారీ విష సర్పం ఒక రైతును కాటు వేయడానికి ప్రయత్నించింది. అతను త్రుటిలో తప్పించుకొని ఈ విషయాన్ని పొలాల్లో ఉన్న రైతులకు చెప్పాడు. వెంటనే గిరిజన రైతులు అక్కడికి చేరుకుని ఆ భారీ విష సర్పాన్ని హతమార్చారు. ఇటువంటి భారీ సర్పాన్ని ఎప్పుడూ చూడలేదని వారు తెలిపారు. ఇది గిరినాగు అని కొందరు అంటున్నారు. ఈ సర్పం కాటు వేస్తే క్షణాల్లో మరణిస్తారని అంటున్నారు. ఈ ఘటనతో అమ్మవారి ధారకొండ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# టెన్త్ మూల్యాంకనం కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి



**విజయనగరం, పతాకం న్యూస్:** పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనం ప్రారంభమయ్యింది. ఉదయం 8గంటలకు ఉపాధ్యాయులంతా కేంద్రాలకు చేరుకోగా 9.30 గంటల నుంచి మూల్యాంకనం ప్రారంభమైంది. కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి పిఎస్ఆర్ స్కూల్ వద్ద మూల్యాంకనం కేంద్రాన్ని పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మూల్యాంకనం పారదర్శకంగా, సమయపాలనతో నిర్వహించాలని అన్నారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన స్పెప్పల మూల్యాంకన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, మూల్యాంకనంలో పాల్గొంటున్న అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, చీఫ్ ఎగ్జామినర్ల పనితీరును సమీక్షించారు. ప్రతి ప్రశ్నపత్రాన్ని నిర్దిష్ట మార్గదర్శకాలకు అనుగుణంగా ఖచ్చితంగా మూల్యాంకనం చేయాలని సూచించారు. పరీక్షల విశ్వసనీయతకు భంగం కలగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా మూల్యాంకనం చేయాలని కలెక్టర్ సూచించారు. తనిఖీలో డిఇఒ యు. మాణిక్యం నాయుడు, విద్యాశాఖ అధికారులు, క్యాంప్ అధికారులు పాల్గొన్నారు. ఫ్యాప్టో పిలుపు మేరకు పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 9న స్పాట్ మూల్యాంకన కేంద్రంలో సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్య సంఘాల నాయకులు, వై. అప్పారావు, శ్రీనివాసరావు, రమేష్ చంద్ర పట్నాయక్, భాస్కరరావు, తిరుపతి నాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



**పార్వతీపురం, పతాకం న్యూస్:** మార్చి నెల వేతనాలు నేటికీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించకపోవడం అన్యాయమని, వెంటనే వారి ఖాతాల్లోకి చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ, మున్సిపల్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుని నెల జీతం చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని అన్నారు. వెంటనే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లకు రిటైర్ అయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంపు, చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, పిఆర్సీ, కార్మికుల జీతాలు పెంచాలని, ప్రభుత్వమే నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలని, పట్టణ విస్తరణనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల పనిముట్లను వాహనాలను మరమ్మతులు చేపట్టాలని, పర్మినెంట్ కార్మికులకు రెండేళ్లు కుట్టుకూలి డబ్బులివ్వాలని, పారిశుధ్య పని నిమిత్తం శంబర యాత్రకు వెళ్లిన కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు రాజశేఖర్, పి.వరదరాజు, బి.రవి, యం.శివ, గంగేలు, గుంపుస్వామి, శారద, లక్ష్మీ, పాపమ్మ, సుజాత, ఇప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు. సాలూరు : మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శంకరరావు, టి.రవి మాట్లాడుతూ ప్రభుత్వం ముందు చూపు లేకుండా మున్సిపల్ కార్మికుల జీతాల చెల్లింపులకు సంబంధించి కొత్త విధానాలు తీసుకువస్తుందని, అందువల్లే మార్చి నెల జీతాలు నేటికీ బిల్లులు పెట్టని పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో జీతాల కొరత ఉందని, ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి దృష్టిలో యూనియన్లు ఇప్పటికే పెట్టినా స్పందనలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# అమరావతికి రాజముద్ర... అసలైన పరీక్ష ఇప్పుడేనన్న విజయసాయిరెడ్డి



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి స్పందించారు. ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మక చర్యగా అభివర్ణించిన ఆయన, రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపారు. అయితే, అసలు పరీక్ష ఇప్పుడేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ గౌరవనీయ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారు ఆమోదముద్ర వేయడాన్ని నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. 2024 జూన్ 2 నుంచి ఇది అమల్లోకి రావడం ఒక చారిత్రాత్మక ముందడుగు. అయితే, ఈ నిర్ణయం చరిత్రాత్మకమైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం దీనిని ఎలా అమలు చేస్తుందన్నదే అసలైన సవాల్. 2014 నుంచి ఏడేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ, ఒక ప్రాధాన్య నగరం చూడాల్సినంత అభివృద్ధిని అమరావతిలో చూపించలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా, రాజధాని విషయంలో ఇతర ప్రణాళికలతో ముందుకు వెళ్లిందన్నారు.

# 'ప్రభుత్వాలు మారుతున్నాయి... మా తలరాతలు మారడం లేదు'



**నంద్యాల, పతాకం న్యూస్:** ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ 98 జీవో నీటి ముంపు బాధితుల తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నందికొట్కూరు పట్టణం పొట్టి శ్రీరాములు సర్కిల్లో నీటి ముంపు బాధితుల రిలే నిరాహారదీక్షలు మంగళవారంతో 13 రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .... కఅష్ణా నదిపై భారీగా నిర్మించిన శ్రీశైలం బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మాణంలో ఇల్లు, పొలాలు సర్వం కోల్పోయామని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. భాదితులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో 98 ప్రతిపాదించి ఏప్రిల్ 15 కు 40 సం,, పూర్తవుతుంది. అని తెలిపారు. 1960 లో ప్రాజెక్టు నిర్మాణం 1981 లో పూర్తి చేసి జాతికి అంకితం చేశారు అని తెలిపారు. ఆనాడు ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 1983 ముఖ్యమంత్రిగా ఎన్నికైన సందర్భంగా శ్రీశైలము ముంపు భాధితుల గోడు స్వయంగా విని 1986 ఏప్రిల్ 15 న ఇంటికొక ఉద్యోగం ఇవ్వాలని జీవో 98 ను విడుదల చేశారు అని గుర్తు చేశారు. టీడిపి ఆవిర్భావం పూర్తయి 44 సంవత్సరాలు పూర్తయింది. జీవో 98 కు 40 సం పూర్తయింది అని తెలిపారు. శ్రీశైలం ముంపు భాదితులకు మాత్రం న్యాయం జరగడం లేదని ముంపు భాదితులు వాపోతున్నారు. నందికొట్కూరు పరిసర ప్రాంతాలైన పగిడ్యాల కొత్తపల్లి, పాములపాడు, మిడ్తూరు మండలాలలోని సుమారు 44 గ్రామాల ప్రజలు శ్రీశైల ప్రాజెక్టు నిర్మాణంలో వేలాది ఎకరాలు సాగుభూమిని, రాత్రి కి రాత్రి ఇల్లు ఖాళీ చేసి చెట్టుకొకరు పుట్టకొకరు గా వివిధ ప్రాంతాలకెళ్ళి తమకు తోచిన చోట బతుకీడుస్తున్నారు అని తెలిపారు. ప్రభుత్వాలు హామీలిస్తున్న అమలుకు నోచుకోక దిక్కుతోచని స్థితిలో ముంపు భాదితులు మానసిక వ్యదకు గురయి 32 మంది ఆత్మహత్యలు చేసుకొని చనిపోవడం భాదాకరం అని తెలిపారు. వారి కుటుంభాలు రోడ్డున పడి రోదిస్తున్న ప్రభుత్వాలకు చీమకుట్టినట్టయినా లేదని ముంపు భాదితులు వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్న మా తలరాతలు మారడం లేదని ముంపు భాదితులు క్షోభకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో102 రోజులు దీక్షలు చేసినా ఇది తెలుగుదేశం పార్టి హామి అంటు స్థానిక నేతలు ఒకరి ఒక్కరు తమ మధ్య వున్న విభేదాల కారణంగా శ్రీశైలం ముంపు భాదితులకు న్యాయం చేయకుండా మాయమాటలు చెప్పి దీక్ష విరమింపజేశారు అని తెలిపారు.

# భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి 2020 సెప్టెంబర్ 7 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లన్నీ చెల్లించాలని జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సి ఐ టి యు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బి. రమణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె. అసరప్పడు, సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2020 సెప్టెంబర్ 7నుంచి గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిలిపివేసిందని, గత 5 సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్‌లు, డెలివరీ, వివాహం, డెత్ , అంగవైకల్యం సంభవించే సందర్భంలో సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు రావలసిన బెనిఫిట్స్ అన్ని అమలు కాకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోపాటు యాక్సిడెంట్లు బెనిఫిట్ 10 లక్షలు, పాక్షిక, పూర్తి అంగ వైకల్యానికి 5 లక్షలు, పిల్లలకు స్కాలర్షిప్‌లు, కార్మికులకు పనిముట్లు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బలస శ్రీను, నాయకులు పెంటయ్య, రమణ, అప్పలనాయుడు, భాస్కర్ రావు, రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడతాం: బొత్స సత్యనారాయణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఏపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఎవరైనా విమర్శ చేస్తే విధాన పరంగా ఉండాలన్నారు. బుధవారం ఏపీలోని అన్ని జిల్లాల్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టం చేశారు. ఈరోజు(మంగళవారం) విశాఖపట్నంలోని వైసీపీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కలిపి మావిగాన్ అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పారని అన్నారు. రాజధాని పరిధిలో వీటిని తీసుకురమ్మని తాము అంటున్నామని.. ఇందులో తప్పు ఏం ఉందని చెప్పారు. తమ నాయకుడు అభిప్రాయాన్ని తాము గౌరవిస్తున్నామన్నారు. అమరావతికి తాము వ్యతిరేకం కాదని...అక్కడ దోపిడీకి మాత్రమే తాము వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. కూటమి కృషితోనే భోగాపురం వచ్చిందని ఒప్పు కొంటున్నానని అన్నారు. తాము ఈ ఎయిర్‌పోర్టుకి అన్ని అనుమతులు తెచ్చామని..కానీ ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌కి దారి లేదని ప్రస్తావించారు. అందుకే తాము భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కి దారేదని అడుగుతున్నామన్నారు. రుషికొండ భవనాలు తమ కోసం ఉంచుతున్నారేమోనని అన్నారు. ఏపీలో పరిస్థితులు ఘోరంగా ఉన్నాయని చెప్పారు. మహిళలు రోజుకోకరు హత్యకు గురవుతున్నారని, అత్యాచారం జరుగుతున్నాయని ఆరోపించారు. గీతం యూనివర్సిటీలో సీఎం కుటుంబ సభ్యులు భూ దోపిడి చేస్తున్నారని బొత్స సత్యనారాయణ విమర్శించారు.

# రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం

**హైదరాబాద్, పతాకం న్యూస్:** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు.

# ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్‌లు పంపిణీ



**విజయనగరం, పతాకం న్యూస్:** వేసవిలో తీవ్ర ఎండల దృష్ట్యా ఉపశమనం పొందడానికి సుమారు రూ.1లక్ష విలువైన హ్యాట్స్, వాటర్ బాటిల్, బ్యాగుతో కూడిన సమ్మర్ కిట్‌లను ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే, ఎఎస్ఐలు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లకు ఎస్‌పి ఎఆర్ దామోదర్ అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే వేళలను మినహాయించి, ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పని గంటలను మార్పులు చేయాలని ట్రాఫిక్ సిఐని ఆదేశించారు. ప్రజలకు నిరంతరం సేవలందించడంతో పాటు, రోగ్యంపై కూడా ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని, తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వేసవిలో ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు, డీహైడ్రేషన్ కు గురికాకుండా తరుచూ మంచి నీళ్ళు, మజ్జిగ, ఒఆర్ఎస్, గ్లూకోజ్ తాగాలని తెలిపారు. ట్రాఫిక్ సిగల్ పాయింట్స్ వద్ద వాహనదారులు ఎక్కువ సమయం ఎండలో వేచి ఉండకుండా సిగల్ టైమింగ్సు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిఐకి సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్బి సిఐ ఎవి లీలారావు, ట్రాఫిక్ ఎస్‌ఐలు ఎస్.భాస్కరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

# భూముల రక్షణకు రైతుల పోరాటం



**భోగాపురం, పతాకం న్యూస్:** భోగాపురం పరిసర ప్రాంతాల్లో ఐటీ కంపెనీల స్థాపన పేరుతో తమ వ్యవసాయ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనే భయంతో రైతులు గత రెండు నెలలుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ నిరసనకు 60 రోజులు పూర్తికావడంతో రైతులు భూ పరిరక్షణ వేదిక వద్ద వంటా–వార్పు కార్యక్రమం నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. తమ పొలాల్లోనే టెంట్లు వేసుకుని భూములకు కాపలా కాస్తూ నిరసన కొనసాగిస్తున్న రైతులు, తమ భూములు తీసుకొని తమ కుటుంబాలకు అన్యాయం చేయవద్దు అంటూ నినాదాలు చేశారు. భూములే తమ జీవనాధారమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**పార్వతీపురం, పతాకం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారం లో అధికారులు అప్రమత్తం గా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు.పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. డిఆర్ఒ కె.హేమలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళ్యాణ్ చక్రవర్తితో కలిసి ఫిర్యాదుదారుల నుంచి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉండకుండా ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పిజిఆర్ఎస్‌లో నమోదైన ఫిర్యాదులకు సరైన పరిష్కారంతో పాటు, సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యతాయుత చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సంరద్భంగా 88 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 25 ఫిర్యాదులు రెవెన్యూ క్లినిక్‌కు వచ్చాయి. కార్యక్రమంలో వివిధశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సీతంపేట ఐటిడిఎలో...సీతంపేట: స్థానిక ఐటిడిఎలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 11 వినతులు వచ్చాయి. ఎపిఒ జి.చినబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌లో డిప్యూటీ డిఇఒ నారాయుడు, జిసిసి డిఎం దాసరి కృష్ణ, మేనేజర్ నరసింహులు, ఎఇ నీలిమ, వెంకటేష్, కిరణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్‌లో వినియోగదారుల క్లినిక్ వినియోగదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు.. అన్యాయాలపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్ వద్దనే క్లినిక్ ఏర్పాటు చేశామని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గల ప్రజా సమస్యల పరిష్కార వేదిక మందిరం వద్ద కన్స్యూమర్ క్లినిక్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, వినియోగదార్ల ఫోరమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాలదే కీలక బాధ్యత : మంత్రి సంధ్యారాణి



**సాలూరు, పతాకం న్యూస్:** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటి వినియోగం, నీటి భద్రతలో సాగునీటి సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన "నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో కలిసి సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈనెల 6నుంచి జూలై 14 వరకు వంద రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కాలంలో క్షేత్రస్థాయిలో సాగునీటి అవసరాలను గుర్తించడం, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయడం, యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకొని, సాగునీరు సకాలంలో రైతులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఈ ఏడాది రూ.490 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజా సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.నీటి నిల్వ సామర్థ్యం పెంచడమే : కలెక్టర్ కలెక్టరేట్ : 'జలధార' కార్యక్రమం ద్వారా రాబోయే వంద రోజుల్లో నిర్దిష్ట లక్ష్యాలతో నీటి సంరక్షణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి ఆదేశించారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నీటి భద్రతా సాగునీటి సంఘ బాధ్యత వంద రోజుల కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని, గ్రామంలో నీటి నిల్వను పెంచడానికి, వృథాను అరికట్టడానికి ఉన్న అవకాశాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. పాడైన చెరువు తూములు, పూడికతో నిండిన కాలువలను గుర్తించి వాటిని బాగు చేయడం, గతంలో ఉన్న ఆయకట్టును పునరుద్ధరించడమే కాకుండా, చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి అదనపు ఆయకట్టుకు నీరు అందించడమే ధ్యేయమని పేర్కొన్నారు. చెరువులు, కాలువల ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. జిల్లాలో దాదాపు 2,900 చెరువులను గుర్తించి, వాటి చుట్టూ ఆక్రమణలు జరగకుండా ఉపాధి హామీ పథకం కింద ఫెన్సింగ్ వేయడం, చుట్టూ మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టనున్నామని, దీనివల్ల చెరువుల సరిహద్దులు స్పష్టంగా తెలియడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు




**బాపట్ల, పతాకం న్యూస్:** పిడుగురాళ్ల వాడరేవు జాతీయ రహదారిపై వాహనదారులకు పర్చూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ ప్రజలకు ముఖ్యమైన రోడ్డు భద్రత నియమాల గురించి వివరించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదు. సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలి,మద్యం సేవించి వాహనం నడపకూడదని వేగ పరిమితులను తప్పక పాటించాలి. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకూడదు ట్రాఫిక్ సిగల్స్ మరియు రూల్స్ పాటించాలని పేర్కొన్నారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. పోలీసులు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ, నియమాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

## మణిపూర్‌లో ఉద్రిక్తతలు .. బాంబుదాడిలో ఇద్దరు చిన్నారులు మృతి



**ఇంఫాల్ :** మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్‌జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళనకారులపై కాల్పులకు దిగారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధించారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మోయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి సుమారు 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

# సచివాలయ భవనాలకు మోక్షం ఎప్పుడో?



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాలో చాలా చోట్ల సచివాలయ భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యతా భవనాలుగా పేర్కొన్నప్పటికీ నిధులు సక్రమంగా విడుదల చేయక పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వంలోనైనా వాటికి మోక్షం కలుగుతుందని భావించినప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదని పలువురు అంటున్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రజలకు పౌరసేవలను సక్రమంగా అందించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వం భవన నిర్మాణాలపైనా దృష్టి సారించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ సచివాలయాల భవన నిర్మాణాలపైనా దృష్టి పెట్టాలని ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కోరుతున్నారు. ఏజెన్సీ పదకొండు మండలాల పరిధిలో 212 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. 2020లో వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని భావించి జాతీయ ఉపాధి హామీ పథకంలో ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏజెన్సీ వ్యాప్తంగా 212 గ్రామ సచివాలయాలకు భవనాలను నిర్మించేందుకు రూ.84 కోట్ల 80 లక్షలు మంజూరు చేసింది. కానీ ఆయా భవన నిర్మాణాలకు అప్పటి ప్రభుత్వం సక్రమంగా నిధులను విడుదల చేయలేదు. దీంతో 2020, 2021 రెండేళ్లు భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగాయి. ఆఖరికి 2022లో కొంత మేరకు నిధులు విడుదల కావడంతో అరకొరగా భవన నిర్మాణాల పనులు జరిగాయి. ఏజెన్సీలో మొత్తం 212 గ్రామ సచివాలయాల్లో ప్రస్తుతం 87 భవనాలు మాత్రమే పూర్తిగా అందుబాటులోకి రాగా, 20 పూర్తయ్యే స్థాయిలో, 65 తుది దశలో, 28 రెండు శ్లాబుల స్థాయిలో, 10 తొలి శ్లాబ్ వేయగా, 2 రూఫ్ లెవల్‌లో ఉన్నాయి. అయితే ఎక్కువ సంఖ్యలో భవనాలు అసంపూర్తిగా ఉండడంతో వసతికి ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల అందుబాటులో ఉన్న చిన్న భవనాల్లోనే వాటిని నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు.

గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణాలపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడంతో అసంపూర్తిగా ఉన్న అవి పూర్తవుతాయనే ఆశాభావం కలుగుతున్నది. ఇదే విధంగా జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఏజెన్సీ వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనాలను పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు వసతి కల్పించేందుకు భవనాలను మంజూరు చేశారు. ఇదే క్రమంలో గిరిజన ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గ్రామ సచివాలయ భవనాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడితే, గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలకు సైతం మేలు జరుగుతుందని మన్యం వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అన్నదాతను నిండా ముంచిన అకాల వర్షం..



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం అనూహ్యంగా మారిపోయింది. అనుకోకుండా ముంచుకొచ్చిన అకాల వర్షాలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. చేతికొచ్చిన పంట కళ్ల ముందే తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పలు జిల్లాల్లో ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఆరుగాలం శ్రమించి రోడ్లపై ఆరబోసుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. మరోవైపు రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు ఒకవైపు వర్షాలు, మరోవైపు తీవ్రమైన ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. వివిధ జిల్లాల్లో కురిసిన వర్షాలు, పంట నష్టం, వాతావరణ శాఖ హెచ్చరికల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా మనుబోలు మండలంలో కురిసిన అకాల వర్షం రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. బద్దెవోలు క్రాస్ రోడ్డులో రైతులు దాదాపు 100 పుట్లకు పైగా ధాన్యాన్ని ఆరబెట్టారు. కొనుగోలు చేసేవారు లేకపోవడంతో ఆరుబయటే ఉంచారు. సోమవారం తెల్లవారుజామున ఒక్కసారిగా వర్షం విరుచుకుపడింది. దీంతో బీపీటీ, షుగర్ లెస్ రకాలకు చెందిన 90 పుట్ల ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. గిట్టుబాటు ధర లేక ఇప్పటికే అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం 'మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు' తయారైంది. ఎకరానికి రూ. 30 వేలు పెట్టుబడి పెట్టి పంట పండించారు. ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని ఎవరూ కొనరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వారు కన్నీటిపర్యంతం అవుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. జాతీయ రహదారిని ఆనుకుని ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న కండెలు పూర్తిగా తడిసిపోయాయి. కనీసం పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు లబోదిబోమంటున్నారు. వర్షం కారణంగా మామిడి, జీడిమామిడి, మిరప పంటలు దెబ్బతిన్నాయి. కూలీల సాయంతో తడిసిన పంటను ఒకచోట పోగు చేస్తున్నారు. పోలవరం నియోజకవర్గంలోని కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, మన్యం ప్రాంతాల్లోనూ కుండపోత వర్షం కురిసింది. ఉక్కబోత తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురు గాలులకు మామిడి కాయలు పెద్ద ఎత్తున నేలరాలాయి. జడివానకు ఆకులపై జిడ్డు కోల్పోయి వర్జీనియా పొగాకు తోటలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. అంబాజీపేట, అమలాపురం, అయినవల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, రాజోలు, మలికిపురం, సకినేటిపల్లి ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. ఉదయం 11 గంటలకు ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన వాన మొదలైంది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులు నీట మునిగాయి. ఈదురు గాలులకు జిల్లాలో అనేక చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే, ఈ వర్షం తమ కొబ్బరి, అరటి తోటలకు ఎంతో మేలు చేస్తుందని ఆయా పంటల రైతులు మాత్రం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎంఎస్ఎంఇ పార్క్‌కు భూములివ్వలేం..



**మదనపల్లె, పతాకం న్యూస్:** తంబళ్లపల్లె మండలం, కుక్కరాజుపల్లె గ్రామంలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు కోసం సేకరిస్తున్న, భూమి యజమానులతో, మదనపల్లి సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి తన కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశం సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ సేకరణ విషయంలో మీకు ఉన్న అభ్యంతరాలను తెలియపరచాలని కోరారు. అందుకు భూ నిర్వాసిత రైసులందరూ, భూములు ఇవ్వడానికి వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సంవత్సరానికి మూడు పంటలు పండించుకుంటున్న చిన్న, సన్నకారు రైతుల భూములను లాక్కోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. మొదటిగా ప్రభుత్వం వైపు నుండి ఎంఎస్ఎంఇ పార్క్ భూసేకరణలో స్పష్టత లేదని, కుక్క రాజు పల్లె గ్రామానికి చెందిన దళితులు, బలహీన వర్గాల భూములే ఎందుకు సేకరించాల నుకుంటున్నారో వివరంగా చెప్పాలని పేర్కొన్నారు. ఆయా భూములలో ఏయే పరిశ్రమలు నెలకొల్పాలని ప్రభుత్వానికి ఆలోచన ఉందో ముందే తెలియజేయాలని పేర్కొన్నారు. పరిశ్రమలు నెలకొల్పడం వలన భూ నిర్వాసితుల కుటుంబాలకు ఎలాంటి ప్రయోజనాలు అందుతాయో తెలపాలని, పరిశ్రమలు నెలకొల్పడం వలన పర్యావరణానికి ఎలాంటి ప్రమాదం లేదని, ఆలాంటి అనుమతులు ఏమైనా పొంది ఉంటే చూపెట్టాలని తెలిపారు. అన్నింటికంటే ప్రధానంగా ఎపిఐఐసి, పరిశ్రమల ఏర్పాటు కొరకు భూమి కావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుంటే ఆ లేఖల కాపీలను అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం భూ సేకరణకు ఎలాంటి గవర్నమెంట్ ఆర్డర్లు ఇచ్చిందో, తక్షణమే బహిర్గతం చేయాలని కోరారు. ఇలాంటి అన్ని విషయాల మీద రైతుల సందిగ్ధతను అర్థం చేసుకోకుండా, ఏమాత్రం వివరణాత్మకంగా తెలుపకుండా, భూసేకరణకు ప్రాథమిక నోటీసులు ఇచ్చి, పేద రైతుల భూములను లాక్కొనేందుకు ప్రక్రియను వేగవంతం చేయాలని చూడడం అత్యంత దుర్మార్గమని సబ్ కలెక్టర్‌కు తెలిపారు. ఇలాంటి అంశాల పట్ల మొదటగా వివరణ ఇవ్వగలిగితే, రైతుల అభ్యంతరాల పైన వారు కూడా సమాధానం చెబుతారన్నారు. మీ వైపు నుండి అలాంటి పరిస్థితులు లేకుండా కేవలం రైతుల అభిప్రాయాలను తీసుకోవడం అనేది ఏ మాత్రం సమంజసంగా లేదన్నారు. రైతులందరూ ముక్తకంఠంతో ప్రాణాలనైనా వదులుతాం తప్ప, మా జీవనాధారమైన భూములను వదిలే ప్రసక్తే లేదనీ సబ్ కలెక్టర్ కు తేల్చి చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు మండెం సుధీర్ కుమార్, బాధిత భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## నీటి సంక్షరణలో ప్రజల భాగస్వామ్యం అవసరం



**రామచంద్రపురం, పతాకం న్యూస్:** నీటి వనరుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని వెల్ల గ్రామంలో రూ.4.70 కోట్లతో చేపట్టే పంట కాలువల అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం కోరింగ వంటకాలువ, వెల్ల లాకులు, గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని 4 దశల్లో అమలు చేస్తున్నామని ఆయన వివరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళిక ఏప్రిల్ 6 నుంచి జూలై 14 వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మంత్రి తెలిపారు. కూటమి పార్టీల నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాజులూరు ఎంపిడిఒ రాంబాబు, ఇరిగేషన్ ఎఇ వి.సుజాత, ఎఒలు మణిదీప్, అశోక్, విజయగోపాలరాజు, లకాని కృష్ణచైతన్య, పేపకాయల నారాయణరావు, యనుముల గోపాలకృష్ణ, రైతులు, నీటి సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్వేపై బోల్తాపడిన కారు



**ప్రకాశం, పతాకం న్యూస్:** ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్వే పై కారు బోల్తాపడి మంటలు చెలరేగిన ఘటన మంగళవారం ప్రకాశం జిల్లా శింగరాయకొండలో జరిగింది. శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్వే మీద నెల్లూరు వైపు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు బోల్తా పడి మంటలు చెలరేగాయి. కారులో ఐదుగురు ఉన్నారు ఈ ఐదుగురికి స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ఎస్సై బి మహేంద్ర ఘటనా స్థలానికి చేరుకొని టంగుటూరు నుంచి వచ్చిన ఫైర్ ఇంజన్ తో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

## నల్ల రిబ్బన్లతో ఉపాధ్యాయుల నిరసన




**కాకినాడ, పతాకం న్యూస్:** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కాకినాడ ఎస్ఎస్సి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్‌లతో నిరసన తెలిపారు. ఏప్రిల్ 6 నుంచి 15 వరకూ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్నట్టు వారు తెలిపారు. పిఆర్‌సి కమిషన్ వేయాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని స్పాట్‌లో ఉన్న 1200 మంది ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. అనంతరం డిఇఒ పిల్లి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో కాకినాడ జిల్లా చైర్మన్ కె.కాశీవిశ్వనాథ్, సెక్రటరీ జనరల్ సిహెచ్ సూరిబాబు, ఎం.శ్రీనివాస్, కె.పెద్దిరాజు, ఎస్ఎస్ఆర్‌కె.ప్రసాద్, వి.సోనీ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో అగ్నిప్రమాదం



**అదోని, పతాకం న్యూస్:** వ్యవసాయ మార్కెట్ యార్డు ప్లాట్ ఫారంపై విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో 10బోరాల పత్తి కాలిపోయింది. వివరాలివీ.. హానవాళ్లు గ్రామానికి చెందిన రాజు 16 బోరాల పత్తిని విక్రయానికి తీసుకొచ్చారు. కమీషన్ ఏజెంట్ దుకాణమైన మహా వీరభద్రేశ్వర ట్రేడర్స్ దుకాణం ముందు ప్లాట్‌ఫారంపై రైతు టెండర్‌కు ఉంచారు. ప్లాట్‌ఫారం షెడ్డు విద్యుత్ తీగలు రాపిడికి గురై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల చెలరేగాయి. చుట్టుపక్కల హమాలీలు రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మార్కెట్‌లోనే ఫైర్ ఇంజన్ ఉండడంతో సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడ చేరుకొని ఆర్పి వేశారు. 10 బోరాలు పత్తి కాలిపోవడంతో రూ. 2లక్షల పైగా నష్టం జరిగినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ రైతుకు ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పార్థసారథి మార్కెట్ యార్డ్ చేరుకొని వివరాలను తెలుసుకొని రైతుకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## 194 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**కోనసీమ, పతాకం న్యూస్:** రైతు కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో జిల్లాలో 194 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఆత్రేయపురంలో ఎంఎల్ఎ బండారు సత్యానంద రావుతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రప్రథమంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతుల కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ సౌలభ్యం కల్పించిందన్నారు. గతం లో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులపై ఆధారపడి మోసపోయేవారని, ప్రస్తుతం నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందే అవకాశం కలిగిందన్నారు. మద్దతు ధరకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నేరుగా రైతు ఖాతాల్లోకే 24 గంటలలోపే జమ అవుతుందన్నారు. దీనివల్ల ప్రతి గింజకూ తగిన విలువ దక్కుతుందన్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన తేమ యంత్రాలు, తూకం మిషన్లు, గన్నీ బ్యాగులను సిద్ధం చేశామన్నారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు పెద్దపీట వేస్తోందన్నారు. కోనసీమలో పండే ప్రతి వరి గింజ రైతుకు లాభాన్ని చేకూర్చాలనీ ఆకాంక్షించారు. ఎపి సివిల్ సప్లయి కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు పారదర్శక విధానాలను అవలంభిస్తుందన్నారు

## బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

**అమలాపురం, పతాకం న్యూస్:** విద్యార్థి గాయాలపాలవ్వడానికి గల బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డాక్టర్ నాగమానస హెచ్చరించారు. ఇటీవల అంబాజీపేట జడ్‌పి పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి సిహెచ్.మణికంఠ గునపంతో గోతిని తీసే క్రమంలో గాయపడ్డాడు. ప్రస్తుతం ఆ విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆమె పరామర్శించారు. అనంతరం విద్యార్థితో ఎవరు ఈ పనులు చేయించారు? ఎందుకు చేయించారు? అనే అంశాలపై ఆరా తీశారు. బాలల చేత ఇలాంటి పనులు చేయించడం చట్టవిరుద్ధమని, ఇది బాలల హక్కులపై ప్రత్యక్ష దాడని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర నివేదిక తయారు చేసి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్టు తెలిపారు.

# మజిల్ లాస్‌ను 'రివర్స్' చేయవచ్చా?

15 ఏళ్లకే పిల్లల్లో కాళ్లు లాగడం, మెడ నొప్పులు, ఇక 50 ఏళ్లు దాటిన మహిళల్లో నడుము నొప్పులు. చేతుల్లో, కాళ్లలో బలం లేని పురుషులూ ఎందరో. వీటన్నింటికి ప్రధాన కారణం, మన కండరాలను నిర్లక్ష్యం చేయడమే అంటున్నారు నిపుణులు. ఫలితంగా మజిల్ లాస్‌ను(శాక్రోపినియా) కొనితెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో కండరాలు బలోపేతానికి ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం!

కండరాలు ఎంత బాగా ఉంటే మన మోకాళ్లు, కీళ్లు అంత బలంగా ఉంటాయి. జాయింట్లకు మజిలే సపోర్టింగ్ సిస్టమ్‌లా పనిచేస్తుంది. ఈ క్రమంలో మోకాళ్ల పైనున్న మజిల్ బలం తగ్గితే మోకాళ్ల నొప్పులు, అరుగుదల వంటి సమస్యలు వస్తాయం టున్నారు నిపుణులు. ఇంతటి కీలకమైన కండరాలను కాపాడుకోవడం, పెంచు కోవడం, బలోపేతం చేసుకోవడం వంటివి చేయాలని వివరిస్తున్నారు. కానీ, శారీరక శ్రమ, కసరత్తు, పోషకాహార లేమి కారణంగా వయసుతో సంబంధం లేకుండా, కండరాల సమస్యలు వెంటాడుతున్నాయని తెలియజేస్తున్నారు.

సహజంగా 20-30 ఏళ్ల మధ్య కండరాల పెరుగుదల అత్యున్నతంగా ఉంటుంది. 30 ఏళ్ల నుంచి మజిల్‌లాస్ మొదలవుతుంది. 30-40 పదేళ్లలో 3-5 శాతం. 40-50 పదేళ్లలో 3-8 శాతం. 50 ఏళ్ల నుంచి ఏటా 1-2 శాతం. 60 ఏళ్ల తర్వాత మజిల్‌లాస్ మరీ వేగంగా ఉంటుంది. ఎలాంటి కసరత్తులు చేయకుండా, జాగ్రత్తలు పాటించకపోతే 70 ఏళ్లు వచ్చే సరికి 25-30 శాతం మజిల్ లాస్ అవుతుంది.



కండరాలను నిర్మించడంలో జెనెటిక్స్ కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు నిపుణులు. కొంతమందిలో కండరాల పెరుగుదల ఇతరుల కంటే వేగంగా, మరికొందరిలో నెమ్మదిగా ఉండొచ్చని సూచిస్తున్నారు.

30 ఏళ్ల తర్వాత కండర ద్రవ్యరాశి సహజంగా తగ్గుతుంది. తిరిగి శక్తిని, బలాన్ని పొందడం కష్టమవుతుంది. గాయం ప్రభావిత ప్రాంతాన్ని ఎక్కువ కాలం ఉప యోగించకపోతే కండరాల క్షీణతకు దారితీస్తుంది. క్యాన్సర్, మూత్రపిండాల వ్యాధి, శ్వాసకోశ వ్యాధులు కండరాల క్షీణతకు కారణమవుతాయి. కండరాలను క్రమం తప్పక వినియో గించకపోతే అవి క్షీణిస్తాయి. 8 నుంచి 12 వారాలపాటు క్రియారహితంగా ఉంటే గణనీయమైన కండరాల నష్టాన్ని ఎదుర్కోవాల్సిందే. మజిల్‌లాస్‌ను రివర్స్ చేయవచ్చు. ఒకసారి తగ్గిన మజిల్‌ను ఏ వయసులోనైనా మళ్లీ పెంచుకోవచ్చు. డైట్?లో ప్రొటీన్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి. కేజీకి కనీసం 1.2 గ్రామ్?ల ప్రొటీన్ తప్పనిసరి. జిమ్‌లో బాగా అగ్రెసివ్‌గా వర్కవుట్లు చేసి, హెవీ వెయిట్లు లిఫ్ట్ చేసే వారైతే కేజీకి కనీసం 1.5 నుంచి 1.8 గ్రామ్?ల? ప్రొటీన్ తీసుకోవాలి. స్ట్రెంథ్ ట్రైనింగ్ తీసుకునే వాళ్లు రాత్రిళ్లు కచ్చితంగా 7-8 గంటలు నిద్రపోవాలి. శిక్షణలో మైక్రోటెయిర్ అయిన మజిల్ నిద్రలో రిపేరై, తిరిగి పెరుగుతాయి. చివరగా ఇది అవసరమైతేనే మెగ్నీషియంతో పాటు డి విటమిన్‌ను సప్లిమెంట్‌గా తీసుకోవచ్చు అని డాక్టర్ ఆర్థోపెడిక్ సర్జన్ పిన్నమనేని ప్రశాంత్ తెలియజేశారు. మజిల్‌ని మనం పెంచకపోతే పెరగదం టున్నారు నిపుణులు. కండరాలను ఏ వయసులోనైనా పెంచుకోవచ్చని చెబు తున్నారు. ఇందుకోసం జీవితకాల కసరత్తు, ప్రొటీన్ డైట్ తప్పనిసరని సూచిస్తున్నారు.

ప్రొటీన్ కోసం చికెన్, చేపలు, గుడ్లు, పాలు, బీన్స్, చిక్కుళ్లు, తృణధాన్యాలు, సోయా ఉత్పత్తులు తీసుకోవాలి. బాదం, పిస్తా, నట్స్ తీసుకోవడం వల్ల మంచి హెల్దీ ఫ్యాట్ అందుతుంది. ఇది మజిల్ రికవరికీ సహాయపడుతుంది. మినరల్స్, విటమిన్ల కోసం పండ్లు తీసుకోవాలి.

మెంతులు, గుడ్లు, పాలు, చికెన్, చేపలు, రాగులు వీటిలో కాల్షియం కంటెంట్ ఎక్కువ ఉంటుంది. ఇది ఎముకలకు ఉపయోగకరం.

ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. చక్కెర పూర్తిగా తగ్గించగలిగితే మంచిది. వీటిని తీసుకుంటే మజిల్‌ని బ్రేక్ చేస్తాయి.

డి విటమిన్ కోసం కొద్ది సేపు ఎండలో

# పరవాడ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎప్పుడో?




**పరవాడ, పతాకం న్యూస్:** పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఇక్కడ ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు సాధారణ డిగ్రీ కోర్సులు చదవాలంటే గాజువాక, విశాఖపట్నం, అనకాపల్లి వెళ్లాల్సి వస్తున్నది. అమ్మాయిలను అంత దూరంలో చదివించడానికి తల్లిదండ్రులు ఇష్టపడకపోవడంతో ఇంటర్‌తోనే చదువు మానేయాల్సి వస్తున్నది. మండలంలో సింహాద్రి ఎన్టీపీసీ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కు, ఇంకా పలు ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు వున్నాయి. స్థానికులతోపాటు ఆయా కంపెనీలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న వారిలో అత్యధికులు ఇక్కడే కుటుంబాలతో నివాసం వుండడంతో మండలం జనాభా గణనీయంగా పెరిగింది. పదో తరగతి వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో పూర్తిసాయిలో సీట్లు అందుబాటులో వున్నాయి. సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నాడు టీడీపీ హయాంలో పరవాడలో ప్రభుత్వం జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. దీని నిర్మాణానికి అవసరమైన నిధులను సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులను సమకూర్చింది. పరవాడతోపాటు అచ్యుతాపురం, మునగపాక మండలాల్లోని పలు గ్రామాల విద్యార్థులు ఇక్కడ ఇంటర్మీడియట్‌లో చేరుతున్నారు. దీంతో సీట్లకు విపరీతమై పోటీ ఏర్పడి, కొంతమంది అడ్మిషన్లు లభించేవి కావు. అనంతర కాలంలో ఇక్కడ ప్రైవేటు జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు కావడంతో ఈ రెండు కళాశాలల్లో కలిసి 500 మంది వరకు ఇంటర్ విద్యను అభ్యసించే వెసులుబాటు కలిగింది. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ.. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మా, ఇతర వృత్తి ఆధారిత కోర్సుల్లో సీట్లు లభించని వారు, ఇంటర్‌లో కామర్స్, ఆర్ట్స్ గ్రూపులు చదివిన వారు బీఎస్సీ, బీఏ, బీకాం వంటి డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే గాజువాక, విశాఖపట్నం, అనకాపల్లి వెళ్లాల్సిందే. రోజూ అంతదూరం వెళ్లిరావడానికి వ్యయప్రయాసాలు పడాల్సి వస్తున్నది. ఆర్థికంగా మెరుగైన కుటుంబాలకు చెందిన అబ్బాయిల వరకు అంతగా ఇబ్బంది లేనప్పటికీ అమ్మాయిలను మాత్రం డిగ్రీ చదివించడానికి ఎక్కువ మంది తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు.

ఉదయం ఏడు గంటలకే ఇళ్ల నుంచి బయలుదేరాల్సి రావడం, సాయంత్రం తరగతులు ముగిసి, ఇంటికి చేరేసరికి రాత్రి ఏడు, ఎనిమిది గంటలు అవుతుండడమే ప్రధాన కారణం. దీంతో చాలా మంది అమ్మాయిలు ఇంటర్‌తోనే చదువు అపేయాల్సి వస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో పరవాడలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని నాటి వైసీపీ పాలకులు ప్రకటించారు. కానీ కార్యరూపం దాల్చలేదు. విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం అయినా పరవాడలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇరాన్‌ను అంతం చేస్తాం: ట్రంప్




**న్యూయార్క్:** ఎన్ని డెడ్‌లైన్‌లు విధించినా ఇరాన్ కాల్పుల విరమణకు ఒప్పుకోకపోవటంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ దిగిరాకపోతే ఒక్కరాత్రిలో ఆ దేశాన్ని పూర్తిగా ఆక్రమించుకోగలమని, ఒక్క రోజులో పూర్తిగా నాశనం చేయగలమని హెచ్చరించారు. ఆ పని మంగళవారం రాత్రే జరగొచ్చని అన్నారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ఇరాన్ నిరాకరించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించకపోవటం నన్ను నిరాశపర్చింది. ఇక ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఒక్క రాత్రిలో ఇరాన్ మొత్తాన్ని ఆక్రమించుకోగలం.. నాశనం చేయగలం. ఆ పని రేపు (మంగళవారం) రాత్రికే జరగొచ్చు' అని తెలిపారు. ఇరాన్‌లో తమ వైమానికదళం సైనికుడు చిక్కుకుపోయిన విషయాన్ని తన ప్రభుత్వంలోని ఒక ద్రోహి ఇరాన్‌కు తెలిపాడని, అతడిని అరెస్టు చేసి జైలుకు పంపుతామని ప్రకటించారు. ఇరాన్‌లో కూలిన ఎఫ్-15ఈ విమానం పైలట్ కోసం 21 విమానాలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టగా, ఎయిర్‌మెన్ కోసం ఏకంగా 155 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, ట్యాంకర్ విమానాలతో గాలింపు నిర్వహించినట్లు తెలిపారు. తమ విమానాలు శత్రువు చేతికి చిక్కకూడదనే రెండింటిని పేల్చివేసినట్లు చెప్పారు. అమెరికా హెచ్చరికలపై ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ తీవ్రంగా స్పందించారు. 'బెదిరింపులు, దాడులు, ఐఆర్‌జీసీ కమాండర్లను చంపటం ద్వారా మా సైనిక బలగాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. మా సైనికులు మరింత పౌరుషంతో పోరాడుతారు. మానవత్వంపై జరుగుతున్న ఈ దాడులకు అమెరికా, దాని మిత్ర దేశాలు తగిన మూల్యం చెల్లించక తప్పదు అని సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. కాగా, యుద్ధాన్ని ఆపేందుకు ఈజిప్టు, తుర్కియే, పాకిస్థాన్ రూపొందించిన రెండు దశల కాల్పుల విరమణ సంధి ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. శాశ్వత శాంతికి హామీ ఇవ్వని ఎలాంటి సంధికి తాము అంగీకరించేది లేదని ఈజిప్టులో ఇరాన్ రాయబారి మొజ్తబా ఫిర్దౌసీ సోమవారం స్పష్టంచేశారు. యుద్ధానికి ముగింపు పలికేందుకు పది షరతులతో కూడిన సంధి ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా అమెరికాకు చేరవేసినట్లు ఇరాన్ అధికార వార్తా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ న్యూస్ ఏజెన్సీ(ఇర్నా) తెలిపింది. తాత్కాలిక కాల్పుల విరమణ శత్రువు బలం పుంజుకునేందుకు అవకాశం ఇస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ భగే వ్యాఖ్యానించారు




## ఇలాంటివి ఒక్కరోజులో సాధ్యం కావు...
### ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించడంపై భువనేశ్వర్ కుమార్




"మైలురాళ్లు అనేవి ఒక్కరోజులో సాధ్యమయ్యేవి కావు. ఏళ్ల తరబడి నిరంతరంగా పడిన శ్రమకు దక్కే ఫలితాలు ఇవి" అని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేసర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు. ఐపీఎల్‌లో 200 వికెట్ల మైలురాయితో చరిత్ర సృష్టించిన సందర్భంగా అతడు తన అనుభవాలను పంచుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించడంపై భువనేశ్వర్ సంతోషం వ్యక్తం చేశాడు. "ఐపీఎల్ నా కెరీర్‌లో ఓ కీలక భాగం. 200 వికెట్లు పడగొట్టడం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నా ఐపీఎల్ ప్రయాణం ఆర్సీబీతోనే మొదలైంది. మళ్లీ ఇక్కడికే తిరిగొచ్చి ఈ ఘనత సాధించడం ఒక ఫుల్ సర్కిల్ మూమెంట్‌లా అనిపిస్తోంది" అని భువీ తెలిపాడు. బౌలర్లకు ఆట కఠినంగా మారుతోందని భువనేశ్వర్ అభిప్రాయపడ్డాడు. "కేవలం నైపుణ్యం మాత్రమే కాదు, పరిస్థితులకు తగ్గట్టుగా బౌలింగ్ చేయడం, బ్యాటర్లను ఇబ్బంది పెట్టేందుకు కొత్త మార్గాలు అన్వేషించడం ముఖ్యం. ఇది బ్యాటర్ల గేమ్ అని అంటుంటారు, కానీ బౌలర్లు కూడా వారికి గట్టి సవాలు విసురుతున్నారని నేను భావిస్తున్నా" అని వివరించాడు. చెన్నైతో మ్యాచ్ గురించి మాట్లాడుతూ, "ఓ బౌలింగ్ యూనిట్‌గా మేము సమావేశాల్లో చర్చించుకున్న ప్రణాళికలకే కట్టుబడి ఉన్నాం. ప్రత్యర్థులకు అనుగుణంగా సిద్ధమవుతున్న తీరు మాకు మంచి ఫలితాలను ఇస్తోంది" అని భువీ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ 41 పరుగులకు 3 వికెట్లు పడగొట్టి, ఐపీఎల్ చరిత్రలో 200 వికెట్లు తీసిన తొలి ఫాస్ట్ బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. మొత్తం 192 ఇన్నింగ్స్‌లలో 202 వికెట్లతో, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చాహల్ తర్వాత రెండో స్థానంలో ఉన్నాడు.

## చెన్నై సూపర్ కింగ్స్ వరుస
# ఓటములకు కారణాలేంటి?




చెన్నై సూపర్‌కింగ్(సిఎస్‌కే)కు అభిమాన గణం ఎక్కువే. సొంత మైదానం ఎం. చిదంబరం స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్ అంటే.. పసుపు జెర్సీలతో కళకళలాడుతుంది. అలాంటి చెన్నై సూపర్‌కింగ్స్ ఈ సీజన్‌లో ఆడి 3మ్యాచుల్లోనూ ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ ఓటములు కెప్టెన్సీ లోపం కారణంగా వస్తున్నాయా..? ఫినిషింగ్ కింగ్ మహేంద్రసింగ్ ధోనీ, బ్రెవీస్ జట్టుకు అందుబాటులో లేకపోవడమో.. ఇలా జరుగుతున్నాయా.. అనేది సగటు ప్రతి చెన్నై అభిమానిని కలచివేస్తోంది. ధోనీ కెప్టెన్సీ త్యాగం చేసిన తర్వాత రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఆ జట్టు ఆడిన 22మ్యాచుల్లో ఏకంగా 14 మ్యాచుల్లో ఓటమిపాలైంది. ఒకప్పుడు చెన్నై సూపర్‌తో మ్యాచ్ అంటే ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టేది. అంతటి గొప్ప రికార్డు చెన్నై సూపర్‌కింగ్స్ సొంతం. ఆ జట్టు అత్యధికంగా ఐదుసార్లు ఐపిఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2010, 2011, 2018, 2021, 2023లలో ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై.. ఆ తర్వాత సీజన్ 2024లో ఆడిన 14మ్యాచుల్లో 7మ్యాచుల్లో మాత్రమే గెలిచింది. ఇక 2025 సీజన్‌లో అయితే.. 14మ్యాచుల్లో 4మ్యాచుల్లో గెలిచి చిట్టచివరి స్థానంలో నిలిచింది.

ఇక 2026సీజన్‌లో ఆడిన 3మ్యాచుల్లోనూ చిత్తుగా ఓడింది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 8వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 127పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు కేవలం 12.1ఓవర్లలోనే ఛేదించింది. ఇక సొంతమైదానం ఎం. చిదంబరం స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌పై 209 పరుగుల భారీస్కోర్‌ను కొట్టింది. ఆ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు మరో 8బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 5వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకొన్న గైక్వాడ్ నిర్ణయాన్ని బౌలర్లు సద్వినియోగం చేసుకోలేకపోయారు.. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 250పరుగుల భారీస్కోర్ చేసింది. ముఖ్యంగా టిమ్ డేవిడ్(70నాటౌట్; 25బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అనంతరం చెన్నై 19.4ఓవర్లలో 207పరుగులకే కుప్పకూలింది. ఆర్సీబీ చేతిలో 43పరుగుల తేడాతో ఓడిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఈ సీజన్‌లో వరుసగా ఇది మూడో ఓటమి. దీంతో రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా.. గైక్వాడ్ కెప్టెన్సీలో చెన్నై ఆడిన 22 మ్యాచుల్లో 14మ్యాచుల్లో ఓటమిపాలైంది.

ఈ సీజన్ తొలి మ్యాచ్‌లకు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ, ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ బ్రెవీస్ దూరమయ్యారు. ధోనీ గాయం కారణంగా, ఫిట్‌నెస్ కారణాలతో బ్రెవీస్ కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యారు. దీంతో కీపింగ్ బాధ్యతలను టీమిండియా టి20 స్టార్, వరల్డ్‌కప్ విజేత సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. పవర్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్ కూడా ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చెన్నై తదుపరి ఆడే మ్యాచ్‌లకు వీరిద్దరూ అందుబాటులో ఉంటారని సమాచారం.

బ్రెవీస్, ధోనీ ఫిట్‌నెస్ సాధించారని వీరిద్దరూ తదుపరి మ్యాచ్‌కు చెన్నై జట్టులో ఎంట్రీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్య ఓవర్లలో విధ్వంసకర బ్యాటింగ్‌తో విరుచుకుపడగల సత్తా బ్రెవీస్ సొంతం. ఇక ఆర్సీబీతో మ్యాచ్‌లో ఓటమి తర్వాత సీఎస్‌కే హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. 'తదుపరి మ్యాచ్‌వరకు అంతా సర్దుకుంటుందనే అనుకుంటున్నాం. తర్వాతి మ్యాచ్‌కు మాకు ఐదు రోజుల సమయం ఉంది. ఈ ఓటమి బాధించింది. అయితే, మా ప్రణాళికలకు అనుగుణంగా తదుపరి మ్యాచ్‌లో ముందడుగు వేయగలమనే నమ్మకం ఉంది' అని పేర్కొన్నాడు. చెన్నై తదుపరి మ్యాచ్ సొంత మైదానం చెపాక్ వేదికగా ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.




# ఆగస్ట్ 21న థియేటర్లలోకి.. 'ది ప్యారడైజ్'



టాలీవుడ్‌లో ఇప్పుడు ఒకటే టెన్షన్.. అదే రిలీజ్ డేట్స్. ఒక పెద్ద సినిమా డేట్ మారిందంటే, దాని ప్రభావం మిగిలిన అన్ని సినిమాలపై పడుతుంది. ముఖ్యంగా భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాల విషయంలో ఈ జాప్యం నిర్మాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని ప్రతిష్టాత్మక చిత్రాలు ఇప్పటికే రెండు మూడు సార్లు డేట్లు మార్చినా, ఇప్పటికీ ఫస్ట్ కాపీ సిద్ధం కాలేదు. ఈ పరిస్థితి ఇప్పుడు నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ చిత్రానికి ఒక హెచ్చరికలా కనిపిస్తోంది. నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' మీద అంచనాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో చెప్పక్కర్లేదు. ఆగస్ట్ 21న సినిమాను థియేటర్లలోకి తీసుకురావాలని టీమ్ ఫిక్స్ అయ్యింది. ఆగస్ట్ అంటే ఇంకా చాలా టైం ఉన్నట్టు అనిపించవచ్చు కానీ, ప్రాక్టికల్ గా ఆలోచిస్తే చేతిలో ఉన్నది కేవలం నాలుగున్నర నెలలే. నాని ఈ ప్రాజెక్ట్‌ను చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాడు. అందుకే ప్రమోషన్ల కోసమే కనీసం 25 రోజులు కేటాయించాలని గట్టి పట్టుదలతో ఉన్నాడట.

ఈ సినిమాకు అతిపెద్ద బలం, బలహీనత కూడా సంగీత దర్శకుడు అనిరుధ్ అని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం అనిరుధ్ చేతి నిండా నాలుగైదు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ముఖ్యంగా 'జైలర్ 2' వంటి సినిమాలతో ఆయన బిజీగా ఉన్నాడు. ఒకవేళ శ్రీకాంత్ ఓదెల షూటింగ్ పూర్తి చేయడంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా, అనిరుధ్ నుంచి ఆశించిన సమయం దొరకదు. ఆఖరి నిమిషంలో రీ-రికార్డింగ్ పెండింగ్ పడితే సినిమా పోస్ట్‌పోన్ అవ్వడం ఖాయం.

అలాగే సెన్సార్ పనులు, ఇతర టెక్నికల్ వర్క్ అన్నీ జూలై ఆఖరికల్లా పూర్తి కావాల్సిందే.వీశీజఱవం ఇక నాని సినిమాల పబ్లిసిటీ స్ట్రాటజీ గురించి మనందరికీ తెలిసిందే. 'దసరా', 'హాయ్ నాన్న', 'హిట్ 3' కోసం ముంబై నుంచి చెన్నై వరకు ఆయన చేసిన టూర్లు చిన్న విషయం కాదు. పాన్ ఇండియా లెవల్లో తన మార్కెట్‌ను పెంచుకోవడానికి నాని శ్రమిస్తున్నాడు. అందుకే 'ది ప్యారడైజ్' విషయంలో మళ్ళీ డేట్ మారకూడదని నాని కంకణం కట్టుకున్నాడు. తన వంతుగా షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తున్నాడు. ఈ సినిమాలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇందులో మెయిన్ విలన్‌గా నటిస్తున్నారు. కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ ఇంటెన్స్ డ్రామాలో నానికి, మోహన్ బాబుకు మధ్య వచ్చే సీన్స్ 'నెవర్ బిఫోర్' అన్నట్టు ఉంటాయట. ముఖ్యంగా ఈ సినిమా ఇంటర్వెల్ ఎపిసోడ్ గురించి ఇండస్ట్రీలో ఒకటే టాక్.. అది చూసిన వాళ్ళు "ఇదేం మెంటల్ మాస్ రా బాబు" అని షాక్ అవుతున్నారట. శ్రీకాంత్ ఓదెల 'దసరా' కంటే రెట్టింపు స్థాయిలో ఈ సీన్లను డిజైన్ చేశాడని సమాచారం. మరి నాని-శ్రీకాంత్ కాంబినేషన్ ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# తనపై వస్తున్న రుమార్స్‌పై స్పందించిన త్రిష



దశాబ్ద కాలంగా సౌత్ ఇండియాను ఏలుతున్న అందాల సుందరి త్రిష కోలీవుడ్ దళపతి విజయ్. ఈ ఇద్దరి పేర్లు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో మారుమోగిపోతున్నాయి. వీరిద్దరి మధ్య ఏదో నడుస్తోందని, త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారని కోలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే త్రిష సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. త్రిష తన ఇన్స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన ఒక వీడియో కోట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. అందులో ఇద్దరు వ్యక్తుల మధ్య ఆసక్తికర సంభాషణ సాగుతుంది. "ఇతరుల అభిప్రాయాలను, ఆలోచనలను మీరు ఎలా నియంత్రించగలరు? వారిని మీరు శాసించలేరు. మీరు చేయగలిగిందల్లా మీ జీవితాన్ని ఉత్తమంగా జీవించడమే." అంటూ సాగే ఆ వీడియో సారాంశం చూస్తుంటే.. తనపై వస్తున్న రూమర్లకు ఆమె పరోక్షంగా కౌంటర్ ఇచ్చిందా? అనే చర్చ మొదలైంది. ఆ వీడియోలో త్రిష మరో కీలక విషయాన్ని కూడా ప్రస్తావించారు. "ఒక మంచి వ్యక్తిగా ఉండండి. నిజాయితీతో జీవించండి, మాట్లాడండి. అప్పుడే ఇది మీ జీవితంలో అత్యుత్తమ రోజు అని తెలుసుకుని, రాత్రి హాయిగా నిద్రపోగలరు" అని పేర్కొన్నారు. అంటే తన చుట్టూ ఎన్ని వార్తలు వచ్చినా, తాను మాత్రం తన నిజాయితీని నమ్ముకుని ప్రశాంతంగా ఉన్నానని ఆమె చెప్పకనే చెప్పినట్లు కనిపిస్తోంది.

అలాగే ఈ పోస్ట్ ద్వారా తన వ్యక్తిగత విషయాల గురించి ఇతరులు చేసే కామెంట్లను తాను పట్టించుకోనని ఆమె స్పష్టం చేశారు. ఒకవైపు ఈ రూమర్స్ ఇలా ఉంటే, మరోవైపు త్రిష తన కెరీర్ లో ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. సీనియర్ హీరోయిన్ అయినప్పటికీ ఇప్పటికీ స్టార్ హీరోలకు ఆమె ఫస్ట్ ఛాయిస్. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి సరసన 'విశ్వంభర' అనే భారీ సోషియో ఫాంటసీ చిత్రంలో నటిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో త్రిష పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం.






# హీరోయిన్‌గా దేవయాని కుమార్తె!



'కోర్ట్' సినిమా తమిళంలో రీమేక్ అవుతోంది. త్యాగరాజన్ దీనికి దర్శకత్వం వహి స్తుండగా ఆయన కొడుకు ప్రశాంత్ లాయర్ పాత్ర చేస్తున్నాడు. నటి దేవయాని కుమార్తె ప్రియాంక హీరోయిన్‌గా పరిచయం అవు తోంది. గత యేడాది తెలు గులో వచ్చిన 'కోర్ట్' సినిమా సూపర్ హిట్ అయ్యింది. మినిమమ్ బడ్జెట్‌తో తెరకెక్కిన ఆ సినిమా ఏకంగా యాభై కోట్లకు పైగా గ్రాస్‌ను వసులూ చేసింది. హీరో నాని నిర్మించిన 'కోర్ట్' మూవీ నటీనటులు, సాంకేతిక నిపుణులకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ సినిమాతో పరిచయం అయిన హర్ష్ రోషన్, శ్రీదేవికి పలు అవకాశాలు వచ్చాయి. వారిద్దరే జంటగా ఇటీవల 'బ్యాండ్ మేళం' సినిమా కూడా రూపుదిద్దుకుని విడుదలైంది. శివాజీ, రోహిణి, ప్రియదర్శి, సాయికుమార్, హర్షవర్ధన్ తదితరులు ఇందులో కీలకపాత్రలు పోషించారు. మంగపతిగా నటించిన శివాజీకి ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెట్టింది. ది అడ్వకేట్' పేరుతో రీమేక్ చేస్తున్నారు. టైటిల్ రోల్‌ను ప్రముఖ నటుడు ప్రశాంత్ పోషించబోతున్నారు. ఈ సినిమాను ప్రశాంత్ తండ్రి, నట దర్శకుడు త్యాగరాజన్ డైరెక్ట్ చేస్తు న్నారు. దీనిని ప్రముఖ నిర్మాత కతిరేసన్ నిర్మిస్తున్నారు. విశేషం ఏమంటే... ఈ సినిమాతో ఇద్దరు వార సులు అరంగేట్రమ్ చేస్తున్నారు. తెలు గులో శ్రీదేవి పోషిం చిన హీరోయిన్ పాత్రను తమిళంలో ప్రముఖ నటి దేవయాని కుమార్తె ప్రియాంక చేస్తోంది. అలానే హర్ష్ రోషన్ చేసిన హీరో పాత్రను నిర్మాత కతిరేసన్ కొడుకు హరి చేస్తున్నాడు. పోక్సో యాక్ట్ నేపథ్యంలో తెరకెక్క బోతున్న ఈ కోర్ట్ డ్రామాకు జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

సోమవారం జరిగిన సినిమా పూజా కార్యక్రమాలకు హీరో విశాల్, దర్శకుడు వెట్రిమారన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మరి తెలుగు సినిమా స్థాయి విజయాన్ని తమిళ రీమేక్ 'రంజన్' అందుకుంటుందో లేదో చూడాలి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**